## క్లుప్తంగా

### అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్ యాదవ్

మాదాపూర్: ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేపట్టే అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రవికుమార్‌యాదవ్ అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని సేవా సప్తాహం కార్యక్రమంలో భాగంగా భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అర్బన్ ప్రధాన కార్యదర్శి కైతాపురం జితేందర్ ఆధ్వర్యంలో మాదాపూర్‌లో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన ఆయన, రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రక్తదానం చేయడం ఎంతో మంచిదని, ప్రాణాలు కాపాడిన వారమవుతామన్నారు. ప్రతి ఆరోగ్యవంతుడు విధిగా రక్తదానం చేయడానికి ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ, బీజేవైఎం నాయకులు చంద్రశేఖర్‌యాదవ్, ఆనంద్.నవీన్‌రెడ్డి, మహేందర్‌యాదవ్, రాజేందర్‌రెడ్డి, లింగస్వామి, శివకుమార్, మంజునాథ్, గోపి పాల్గొన్నారు.

### 'మనూ' పూర్వ విద్యార్థికి ఫొటోగ్రఫీలో మొదటి బహుమతి



'మనూ' పూర్వ విద్యార్థి దానిష్ రజా

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయం పూర్వ విద్యార్థి డానీష్‌రజా ఫొటోగ్రఫీలో మొదటి బహుమతిని సాధించారు. రెండు రోజుల క్రితం జమ్మూ,కాశ్మీర్, బారాముల్లాలో జరిగిన సింగిల్ ఫొటో పోటీలో ఆయన మొదటి బహుమతిని పొందారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల(జీడీసీ) బారాముల్లా మీడియా స్టడీస్ విభాగం ఆధ్వర్యంలో ఒక రోజు నిడివి వీడియో ఫెస్టివల్‌లో భాగంగా ఈ పోటీని నిర్వహించారు. దానిష్ రజా 'మనూ'లోని మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగంలో చదువుకున్నారు. 2022–23 విద్యాసంవత్సరంలో యూనివర్సిటీ ఫైన్ ఆర్ట్స్ క్లబ్‌కు కార్యదర్శిగా పనిచేశారు. ఆయన ఫొటో గ్రఫీలో మొదటి బహుమతి గెలుపొందడం పట్ల మాస్ కమ్యూనికేషన్ అండ్ జర్నలిజమ్ విభాగం ప్రొఫెసర్లు, అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, పీజీ విద్యార్థులు అభినందించారు.

### బూత్ స్వశక్తికరణ్ అభియాన్

- నేతలకు దిశానిర్దేశం చేసిన మాధవరం కాంతారావు



కూకట్‌పల్లి: దక్షిణాది రాష్ట్రాల్లో బీజేపీ బలపడుతోందని కూకట్‌పల్లి అసెంబ్లీ బీజేపీ ఇన్‌చార్జ్ మాధవరం కాంతారావు అన్నారు. ఆదివారం బూత్ స్వశక్తికరణ్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శక్తి కేంద్రం ఇన్‌చార్జ్‌ల సమీక్ష, సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేసి పలు అంశాలపై నాయకులతో చర్చించారు. బీజేపీ సిద్ధాంతాలతో కూడుకున్న పార్టీ అని అన్నారు. కేంద్ర నాయకత్వం నిర్దేశించిన విధంగా 31 మందితో కూడిన బూత్ కమిటీల ఆవశ్యకతను ఇన్‌చార్జ్‌లకు వివరించారు. పటిష్టమైన వ్యవస్థ పోలింగ్ బూత్ నిర్మాణం వల్ల ఎన్నికల్లో గెలుపు సునాయాసం అవుతందన్నారు. బాలానగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు వినోద్ కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో డివిజన్ బూత్ స్వశక్తి ఇన్‌చార్జ్ శంకర్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీకర్‌రావు, డివిజన్ ఇన్‌చార్జ్ సురేందర్‌రెడ్డి, బీజేపీ నాయకులు సోమశేఖర్, రాములు, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

### అకట్టుకున్న కూచిపూడి నృత్యప్రదర్శన

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న బీహార్ కనెక్ట్ 2023 చేనేత హస్తకళా మేళాలో భాగంగా ఆదివారం గిరీష్ చంద్ర, దేవిగిరీష్ శిష్యబృందం కూచిపూడి నృత్యప్రదర్శన అలరించింది. ఇందులో పూర్వరంగం, గజవదన, సూర్యాష్టకం, బ్రహ్మాంజలి, దశావతారం, తిల్లాన, మంగళం తదితర అంశాలను కళాకారులు ప్రదర్శించి సందర్శకులను ఆకట్టుకున్నారు.



కూచిపూడి నృత్యాంశాలు

# రామమ్మకుంటకు సరికొత్త అందాలు

- పూడికతీతతో జలకళ
- వర్షం నీటితోనే నిండిన రామమ్మకుంట
- వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకు సన్నాహాలు
- సుందరీకరణ పనులకు 'నిథమ్' సమాయాత్తం
- నక్షత్ర, రాశుల వనాల ఏర్పాటుకు చర్యలు



నీటితో కళకళలాడుతున్న 'నిథమ్' ప్రాంగణంలోని రామమ్మకుంట

రాయదుర్గం: ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులన్నీ జలకళ సంతరించుకున్నాయి. అందులో భాగంగానే గచ్చిబౌలిలోని 'నిథమ్' ప్రాంగణంలో దశాబ్దాల చరిత్ర కలిగిన రామమ్మకుంటలోకి కూడా భారీగా వర్షం నీరు వచ్చి చేరింది. సుమారు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కొనసాగుతున్న రామమ్మ కుంటను కాపాడుతూ దీని అందాన్ని మరింత పెంచుతూ, చెరువు విస్తీర్ణాన్ని పెంచుతుండటంతో ఏటేటా చెరువు ప్రాధాన్యత సంతరించుకుంటోంది. ఏటా అక్టోబర్ మాసంలో కురిసే వర్షాలకు ఇందులో గణనీయంగా నీరు వచ్చి చేరేంది. కానీ ప్రస్తుతం సెప్టెంబర్‌లోనే గణనీయంగా నీరు చేరడంతో చెరువు నిండి పరవళ్లు తొక్కుతోంది.

**పూడికతీతతో పెరిగిన నీటి మట్టం...**

- నిథమ్ ప్రాంగంణంలోని రామమ్మకుంటలో మూడేళ్ల క్రితం ఎన్విరాన్‌మెంటలిస్ట్స్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా పర్యవేక్షణలో 20 రోజుల పాటు పూడికతీత పనులు చేపట్టి విజయవంతంగా పూర్తి చేశారు.
- నిథమ్ చరిత్రలో మొదటిసారిగా చెరువులోని నీటినంతా పూర్తిగా తొలగించారు. అనంతరం పూడికతీత చేపట్టి ఆ మట్టిని క్యాంపస్‌లోని వేలాది మొక్కలకు వేశారు.
- దీంతో క్యాంపస్‌తో పాటు చుట్టూరా ఉండే కాలనీల్లోనూ భూగర్భ జలాలు పెరిగేందుకు ఈ చెరువు ఎంతో దోహదం చేస్తుంది.

**సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ...**

- రామమ్మకుంటలో గణనీయంగా నీరు చేరడంతో ఇక సుందరీకరణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని 'నిథమ్' పాలక మండలి నిర్ణయించింది.
- 30ఫీట్ల వరకు నీరు చేరడంతో భూగర్భ జలాలు వృద్ధి చెందాయని, గతంలో మూడున్నర ఎకరాల్లో విస్తరిస్తే పూడికతీత సమయంలోనే అదనంగా మరో అర ఎకరం వరకు స్థలాన్ని ఈ చెరువు విస్తరణకు కేటాయించడంతో మరింత నీరు చేరేందుకు ఆస్కారం కలిగింది.
- చెరువు అందాలను తిలకిస్తూ చెరువుకట్టపై వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- కొబ్బరిచెట్లు, గ్రీనరీ, పూల మొక్కల మధ్య అహ్లాదపూరిత వాతావరణంలో వాకింగ్ చేసేలా తీర్చిదిద్దనున్నారు.
- చెరువు చుట్టూరా ప్రత్యేక లైటింగ్, చెరువులో ఆకట్టుకునేలా ఫౌంటేన్ల ఏర్పాటు, బోటింగ్ సౌకర్యాన్ని కూడా దశలవారీగా అభివృద్ధి చేయాలని నిర్ణయించారు.

**నక్షత్ర, రాశుల మొక్కలకూ ప్రాధాన్యత...**

- చెరువుకు మరింత అందాన్ని సమకూర్చేందుకు రకరకాల మొక్కలు నాటాలని భావిస్తున్నారు.
- చెరువు చుట్టూరా సుందరీకరణలో భాగంగా హరితహారంలో ప్రత్యేకంగా 20 రకాల నక్షత్ర మొక్కలతో ప్రత్యేక వనం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.
- అంతేకాకుండా 12 రకాల రాశుల మొక్కలతో రాశుల వనాన్ని ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక రూపొందించాలని నిర్ణయించారు.

# గణేషుడికి 'మహా నైవేద్యం'

- 108 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు
- కొండాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్ ఐకానియా అపార్ట్‌మెంట్‌లో నిర్వహణ
- పెద్ద సంఖ్యలో పాల్గొన్న మహిళలు



వినాయకుడికి 108 రకాల ప్రసాదాలతో మహానైవేద్యం

రాయదుర్గం: గణనాథుడికి 108 రకాల మహానైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొండాపూర్‌లోని ఎస్ఎంఆర్ వినయ్‌ఐకానియా అపార్ట్‌మెంట్‌లో ఈ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా అపార్ట్‌మెంట్ వాసులు స్వామివారికి ఏడవ రోజైన ఆదివారం మహానైవేద్యం సమర్పించాలని నిర్ణయించారు .ఎస్ఎంఆర్ బిల్డర్స్ ప్రైవేట్ లిమిటెడ్ పర్యవేక్షణ లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అపార్ట్‌మెంట్ వాసుల్లో భక్తిభావన పెంపొందించడం, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించేలా చేయడం, అందరిలోనూ ఐక్యతా భావన పెరిగేలా చేయడం కోసం ఈ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అంతకుముందు గణేష మండపాన్ని పూలు, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని గణేషుడిని దర్శించుకున్నారు.

# రాజకీయాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు

- మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్



కళ్లద్దాలను పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్

హఫీజ్‌పేట్ : శేరిలింగంపల్లి నియోజకవర్గ పరిధిలో ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా సేవలు అందించడమే ట్రస్టు లక్ష్యమని సందయ్య మెమోరియల్ ట్రస్టు చైర్మన్, మాజీ ఎమ్మెల్యే భిక్షపతి యాదవ్ అన్నారు. ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని వేముకుంటలో సందయ్య మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కంటి పరీక్ష శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 20 ఏళ్లుగా నిర్విరామంగా పేదలకు ట్రస్టు సేవలు అందిస్తున్నామన్నారు. రాజకీయ కోణంలో కాకుండా మానవతా దృక్పథంతో ఏర్పాటు చేసిన సామాజిక సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని కోరారు. ప్రజాసేవ చేయడానికి పదవులు, పార్టీలు, ప్రాంతాలు అవసరం లే వని సేవ చేయ్యాలనే దృఢ సంకల్పం ఉంటే చాలన్నారు. ఈ సందర్భంగా సుమారు 500 మందికి కంటి అద్దాలు పంపిణీ చేశారు. ఉచిత కంటి పరీక్షల శిబిరాలను ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, బుచిరెడ్డి, చందర్ యాదవ్, గౌస్, శ్రీనివాస చారి, ఆలీ, రాజన్, కాజా పద్మ తదితరులు పాల్గొన్నారు.



కళాకారుల సంగీత ప్రదర్శన

# అలరించిన 'ఎ నైట్ ఆఫ్ మ్యూజికల్ బ్రిలియన్స్'

- వైట్ నాయిస్ అకాడమీ విద్యార్థుల అద్భుత ప్రదర్శన
- శాంతిసరోవర్ గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో నిర్వహణ



వైట్ నాయిస్ అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శన

రాయదుర్గం: సంగీత ప్రియులను 'ఎ నైట్ ఆఫ్ మ్యూజికల్ బ్రిలియన్స్' కార్యక్రమం విశేషంగా అలరించింది. గచ్చిబౌలి శాంతిసరోవర్‌లోని గ్లోబల్ పీస్ ఆడిటోరియంలో వైట్ నాయిస్ అకాడమీ విద్యార్థులు ఆదివారం రాత్రి అద్భుతమైన ప్రదర్శన నిర్వహించారు. శ్రావ్యమైన సంగతం శ్రోతలను ఎంతగానో ఆకట్టుకుంది. హుషారైన నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఉత్తేజపరిచింది. గచ్చిబౌలిలోని వైట్ నాయిస్ అకాడమీ లండన్‌లోని రాక్ స్కూల్‌తో అనుబంధంగా కొనసాగుతోంది. అకాడమీ కళాకారుల నృత్య ప్రదర్శనలతోపాటు వివిధ వాయిద్యాలపై సోలోగా ప్రదర్శనలు వారి ప్రతిభ, అంకిత భావానికి నిదర్శనగా నిలిచింది. కార్యక్రమంలో అకాడమీ ప్రతినిధులు, అతిథులు వినయ్‌కొల్లి, సంకేత్‌ధరోడ్, సునీల గొల్లపూడి, సునీల్ ఉద్దరాజు, కృష్ణ తులసి, వినాయకరావు,శృతి ఆర్య పాల్గొన్నారు.

# సాయిదత్త గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో షిర్డీ సాయిబాబా



ఆలయ నిర్వాహకులతో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రభాను సత్పతి

రాయదుర్గం: టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి దేవాలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేక అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఒడిషా రాష్ట్ర మాజీ డీజీపీ, షిర్డీసాయిబాబా ఉపాసకులు డాక్టర్ చంద్రభాను సత్పతి బాబాను దర్శించుకుని ప్రత్యేక పూజలను చేశారు. హైదరాబాద్ నగర పర్యటనకు వచ్చిన ఆయన టెలికామ్‌నగర్‌లోని సాయిదత్త గణపతి ఆలయంలో భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్నారు. అంతకుముందు ఆలయ అర్చకులు, నిర్వాహకులు, భక్తులు ఆయనకు పూర్ణ కుంభ స్వాగతం పలికారు. అనంతరం ఆయన ఆలయ కమిటీ నిర్వాహకులు డి రవీందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, ఆలయ అర్చకులు వివివిఎస్ శర్మలను నిత్యం ఆలయంలో పూజల వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు, స్థానికులు టివిఆర్‌మూర్తి, రాజేంద్రప్రసాద్, మురళి, మహిపాల్‌రెడ్డి, దినేష్‌యాదవ్, కాలనీవాసులు, భక్తులు పాల్గొన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ
- ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన సగర సంఘం కమ్యూనిటీహాల్, కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

రాయదుర్గం: పేద,మధ్య తరగతి ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వవిప్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడిగాంధీ అన్నారు. కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో రూ.32 లక్షల ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన సగర సంఘం కమ్యూనిటీ హాల్ మూడో అంతస్తును ఆదివారం ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం అన్ని కులాలకు అన్ని వర్గాలకు సమాన ప్రాధాన్యం ఇస్తోందన్నా రు. అన్ని వర్గాలు ఆర్థికంగా నిలదొక్కుకున్నప్పుడే ఆర్థిక సమానత్వంతో పాటు సామాజిక సమానత్వం సాధ్యమన్నారు. ప్రజల సంక్షేమం కోసం నిరంతరం పాటుపడుతున్న ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు సమరించాలన్నారు. భవిష్యత్తులో అన్ని వర్గాలకు మరిన్ని సంక్షేమ పథకాలతోపాటు సామాజిక కోణంలో సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సగర జాతికి తగిన ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కోకాపేటలో ఆత్మగౌరవ భవనం కోసం రెండు ఎకరాల భూమి, రూ.2 కోట్ల నిధులు కేటాయించారని ఆయన గుర్తు చేశారు. సగర సంఘం భవన నిర్మాణం కోసం రూ.32 లక్షల సీడీపీ నిధులను కేటాయించడం జరిగిందన్నారు. ఈ భవనాన్ని సగరులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సగర, మాజీ కార్పొరేటర్ రవిముదిరాజ్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, సగర సంఘం అధ్యక్షుడు నర్సింహ్మ సగర,నాయకులు ఆస్కాని మారుతి, ముత్యాల హరికిషన్, గౌరక్క, సత్యం, సతీష్, స్రవంతి, మోడలరవి, వెంకట్‌రావు, రవీందర్, వెంకట్‌స్వామి, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ

హఫీజ్‌పేట్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని చందానగర్ డివిజన్ పరిధిలోని గంగారం చెరువు వద్ద ఏర్పాటు చేసిన కోనేరులో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను మియాపూర్ ఏసీపీ నర్సింహారావు, చందానగర్ సీఐ పాలవెల్లితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ ఆదివారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణనాథుల విగ్రహాల నిమజ్జనంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా ఆనందంగా జరుపుకోవాలని, వినాయక విగ్రహాల తరలింపులో ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. భక్తులకు అన్ని రకాల వసతుల కలిపించాలని, కోనేరులో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కోనేరులో ఎప్పటికప్పుడు నీటిని మార్చాలన్నారు. ప్రతి ఒక్కరు మట్టి వినాయకులను పూజించి వారి ఇంటి వద్దే నిమజ్జనం చేయాలని, పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. చెరువుల సంరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో జీహెచ్ఎంసీ, పోలీస్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు లక్ష్మినారాయణ, రవీందర్‌రావు, డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, మిర్యాల రాఘవరావు, వెంకట్రావు, కర్ణాకర్ గౌడ్, ప్రవీణ్, సందీప్‌రెడ్డి, శివ, సాయి తదితరులు పాల్గొన్నారు.

### బొల్లారం మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

జిన్నారం(పటాన్‌చెరు): రాష్ట్రంలోని ప్రతి మున్సిపాలిటీని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేలా ప్రభుత్వం నిధులు కేటాయిస్తోందని, అందులో భాగంగా రూ.60 కోట్లతో బొల్లారం మున్సిపాలిటీని అభివృద్ధి చేస్తున్నామని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి అన్నారు. జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆయా కాలనీల్లో రూ.6 కోట్ల చేపట్టనున్న వివిధ రకాల అభివృద్ధి పనులకు ఆదివారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని అన్ని రాష్ట్రాల ప్రజలు ఈ ప్రాంతంలో ఉండటంతో వారి అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి చేపడుతున్నామన్నారు. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి కృషి చేస్తోందన్నారు. దేశంలోని ఏ రాష్ట్రంలో అమలు కానీ పథకాలు కేవలం తెలంగాణలో మాత్రమే అమలవుతున్నాయన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాల అమలును చూసి ప్రతిపక్షాలు ఓర్చుకోలేకే లేని పోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ రోజారాణి, కమిషనర్ సంగారెడ్డి, నాయకులు చంద్రారెడ్డి, బాల్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, ఆయా కాలనీల కౌన్సిలర్‌లు, అధికారులు పాల్గొన్నారు.

### దళిత సంఘాల ర్యాలీ

జిన్నారం(పటాన్‌చెరు): చిట్కుల్ సర్పంచ్ నీలం మధుకు మద్దతుగా దళిత సంఘాల నాయకులు ఆదివారం మండలంలోని రాళ్లకత్వలో భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో నీలం మధుకు అనుకూలంగా నినాదాలు చేశారు. పటాన్‌చెరు నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్‌ను ఆయనకు కేటాయించాలని డిమాండ్ చేశారు. నీలం మధుకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో మండలంలోని ఆయా గ్రామాల్లోని దళిత సంఘాల నాయకులు శ్రీనివాస్, మురళీకృష్ణ, రమేష్, గణేష్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

### వనజకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ అవార్డు



సాక్షి,సిటీబ్యూరో: ప్రముఖ సైకాలజిస్ట్ 'తథాస్తు లైఫ్' కౌన్సెలింగ్ ఎండ్ ట్రెయినింగ్ కన్సల్టెన్సీ ఫౌండర్ , వనజ ' వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం దక్కించుకున్నారు. మానసిక వైద్య రంగంలో సేవలను అందిస్తున్న ఆమె లాంగెస్ట్ సైకాలజీ వెబినార్ మారథాన్ ఇన్ మెంటల్ హెల్త్‌లో పాల్గొన్నందుకు ఈ అవార్డును అందుకున్నారు.

### యువకులు పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలి

కూకట్‌పల్లి: యువకులు పెద్ద ఎత్తున రాజకీయాల్లోకి రావాలని టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం పిలుపునిచ్చారు. ఆదివారం కూకట్‌పల్లి నియోజకవర్గం అల్లాపూర్ డివిజన్ కొత్తూరు సీతయ్య నగర్‌కు చెందిన బీఆర్‌యస్ కార్యకర్తలు అల్లాపూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షఫీ ఉద్దీన్ ఆధ్వర్యంలో 100 మంది కార్యకర్తలు డా. సత్యం శ్రీరంగం సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి పార్టీ కాండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నీళ్లు, నిధులు, నియామకాల పైన ఏర్పడ్డ తెలంగాణలో సామాజిక న్యాయం, ఆత్మ గౌరవంతో అందరూ బ్రతకవచ్చు అని రాష్ట్రం తెచ్చుకుంటే ఈ బీఆర్‌యస్ ప్రభుత్వంలో అవి ఏవీ సాధ్యం కాకపోగా పేదలు ఇంకా నిరుపేదలు అయ్యారని దుయ్యబట్టారు.



చందానగర్‌లో గణేష్ పూజల్లో ఎమ్మెల్యే గాంధీ..

# 'జైబోలో గణేష్ మహరాజ్‌కీ'..

- అంతటా అదే నినాదం
- వాడవాడలా సందడి
- నిత్యపూజలు....పలు చోట్ల అన్న సమారాధనలు



శేరిలింగంపల్లిలో..

శేరిలింగంపల్లిజోన్‌బృందం: 'జై బోలో గణేష్ మహరాజ్‌కీ జై'.....జై గణేష్......జైజై గణేష్' వంటి నినాదాలతో అంతటా మారుమోగుతోంది. శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్,మియాపూర్, హఫీజ్‌పేట్, మాదాపూర్ డివిజన్ల పరిధిలోని కాలనీలు,బస్తీలు, గేటెడ్ కమ్యూనిటీలు, అపార్ట్‌మెంట్లలో ప్రతిష్టించిన వినాయక విగ్రహాల వద్ద ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలను నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందిస్తున్నారు. కొన్ని గణేష మండపాల వద్ద నిత్యాన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.



నల్లగండ్లలో..



ఖాజాగూడలో..



రాయదుర్గంలో..



గోపన్‌పల్లిలో..